క్లుప్తంగా

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా: వైరా మున్సిపాలిటీలో ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బోడేపూడి భవన్‌లో బొంతు సమత అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా మున్సిపాలిటీలో ఇండ్లు లేని నిరుపేదలు అనేక మంది ఉన్నారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైరాను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది తప్ప అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్, చలపతిరావు, వెంకటేశ్వరరావు, రజిత, రామారావు, మోహన్‌రావు, సుధాకర్, నరసయ్య, నాగుల్ పాషా, కృష్ణవేణి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై మక్కువ చూపాలి



క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందిస్తున్న ఎస్సై కొండల్‌రావు

తల్లాడ: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై మక్కువ చూపాలని తల్లాడ ఎస్సై కొండలరావు అన్నారు. తల్లాడలో క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర ధారుఢ్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎస్సైని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ బాలాజీ, క్రీడాకారులు సురేష్, రాము, పెంటుసాహెబ్, నాగి, బద్రి, రవి, సూరి పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ బలోపేతానికి కృషి



సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

మధిర: మధిర ప్రాంతంలో బీఎస్‌ఎన్‌ఎల్ బలోపేతానికి కృషి చేయాలని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు అమరవాది సత్యనారాయణరెడ్డి సూచించారు. నల్లగొండలో గురువారం జరిగిన నల్లగొండ రీజినల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అధికారులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ లేనందున అదనపు టవర్లు ఏర్పాటుతో పాటు.. మర్లపాడు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో అవసరమైన పరికరాలు అమర్చాలని కోరారు. దీంతో త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. అనంతరం సత్యనారాయణరెడ్డిని సన్మానించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సునీత ఎలిజబెత్ గురువారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి వెంటనే కాంటాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వేణు ఉన్నారు.

ఇసుక లారీ సీజ్

సత్తుపల్లిటౌన్: రాజమండ్రి ఇసుకను లారీలో ఆంధ్రా నుంచి సత్తుపల్లికి తరలించి విక్రయిస్తుండగా స్థానిక పోలీసులు లారీని సీజ్ చేసిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన ఓ వ్యక్తి గోదావరి ఇసుకను లారీలో సత్తుపల్లికి తరలించి విక్రయిస్తుండటంతో పోలీసులు పట్టుకొని లారీని సీజ్ చేశారు. లారీ యజమానితో పాటు డ్రైవర్ లిఖిత్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ కిరణ్ తెలిపారు.

పానీపూరి బండి యజమానిపై దాడి

సత్తుపల్లిటౌన్: పానీపూరి బండి యజమానిపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన గురువారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని శ్రీనివాసా టాకీస్ రోడ్‌లో పానీపూరి బండి యజమాని ఏ.గౌతమ్ నివాసం ఉంటున్నాడు. అయితే అదే పట్టణానికి చెందిన రమేష్ అనుమతి లేకుండా పానిపూరి తినడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రమేష్.. గౌతమ్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకొని.. బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిరుపయోగంగా.. నీటితొట్లు

- దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలని వినతి



మత్కేపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

చింతకాని: అసలే ఎండాకాలం.. దానికి తోడు ఎండ తీవ్రత కూడా రోజురోజుకు పెరుగుతోంది. గుక్కెడు నీటికోసం మనుషులే అల్లాడుతుంటే.. మరి మూగజీవాల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వాగులు, కుంటలు ఎండిపోవడంతో దాహార్తి తీరక అల్లాడుతున్నాయి. పశువుల దప్పిక తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లోని చివరన, పంటపొలాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన కొన్నేళ్ల కిందట నీటితొట్లు నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి.

నిర్వహణ లోపంతోనే..

మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాల్లో నీటితొట్లను నిర్మించింది. అప్పటినుంచి ఇప్పటి వరకు వాటిని ఉపయోగించిన దాఖలాలు లేకపోవటంతో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నీరు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. కొన్నిచోట్ల నిర్వహణ సక్రమంగా లేక శిథిలావస్థకు చేరాయి.

ఎండిన చెరువులు, కుంటలు..

ఎండల తీవ్రతకు మండలంలో ఉన్నటువంటి మున్నేరు, వాగులు, చెరువులు, కుంటలు నీళ్లు లేక పూర్తిగా ఎండిపోయాయి. మేత కోసం పొలాలకు వెళ్లిన మూగజీవాలు తాగునీటి కోసం గ్రామాల్లోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పశువుల దాహార్తిని తీర్చేందుకు కొంతమంది రైతులు వ్యవసాయ, బోరు బావుల వద్ద నీటిని నిల్వచేసి పశువుల దాహార్తిని తీరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్నటువంటి నీటితొట్లను వినియోగంలోకి తీసుకవచ్చి నీటి సౌకర్యాన్ని కల్పించి వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..



గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నీటిసరఫరా లేక నిరుపయోగంగా మారాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో చెరువులు, వాగుల్లో నీరు లేదు. అధికారులు స్పందించి తక్షణమే నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– కాలంగి సైదులు, రైతు, మత్కేపల్లి

ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



పెనుబల్లి : ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు/పెనుబల్లి: యాసంగిలో రైతులు సాగు చేసిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. కల్లూరు మండలం పుల్లయ్య బంజర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించిన ఆమె పెనుబల్లి మండలం బ్రాహ్మళకుంటలో కొనుగోళ్లను ప్రారంభించారు. అదే విధంగా పెనుబల్లిలో ఏఎంసీ చైర్మన్ నీరజ, వీయంబంజర్, గౌరారం గ్రామాల్లో తహసీల్దార్ గంటా ప్రతాప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మడం ద్వారా మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.



కల్లూరు : అభియాన్ యాత్రలో ఎమ్మెల్యే, నాయకులు

కల్లూరులో 'సంవిధాన్'ర్యాలీ..

కల్లూరు: కల్లూరు మండల కేంద్రంలో గురువారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, మాట్లాడుతూ గాంధీ, అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యవహరిస్తున్న బీజేపీ నేతల ప్రజలు గమనించాలని కోరారు. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లు చేర్చడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజ, వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీను, భాగం ప్రభాకర్, నోటి కృష్ణారెడ్డి, మట్టా రామకృష్ణ, రంగు లక్ష్మణరావు, పి.వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఆళ్లకుంట నర్సింహారావు, పి.నగేష్, శీలం బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

మధిర/వైరారూరల్: ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులు సంఖ్య పెంచాలని ఎంఈఓలు వై.ప్రభాకర్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మధిరలోని మాటూరు ఉన్నత పాఠశాలలో, వైరారూరల్‌లోని నారపనేనిపల్లి పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇప్పటినుంచే బడిబాట నిర్వహించాలన్నారు. మధిరలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీహరి చొరవతో కాంప్లెక్స్ నిధుల నుంచి రూ.22,500 విలువైన బోధనాభ్యాసన సామగ్రి కొనుగోలు చేసి ఎంఈఓ ప్రభాకర్ చేతుల మీదుగా తొమ్మిది పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. వైరాలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ వెంకటేశ్వర్లు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ఎంపీఓ జోష్ణ, మాజీ సర్పంచ్ సుజాత, గ్రామ పంచాయతీ సెక్రటరీ అనూష తదితరులు పాల్గొన్నారు.



మధిర: బోధన సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ ప్రభాకర్

పౌష్టికాహారాన్ని గర్భిణులు వినియోగించుకోవాలి



సత్తుపల్లిరూరల్: పోషకాహార ప్రదర్శనలో సీడీపీఓ కనకదుర్గ

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి మండలం కిష్టారం, బేతుపల్లి పంచాయతీలలో నిర్వహించిన ర్యాలీలు, పోషకాహార పదర్థాల ప్రదర్శన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అదే విధంగా పెనుబల్లి-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ మెహరున్నీషా బేగం ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్‌కె రియాజ్, సబీరా దంపతుల పాపకు ఆరు నెలలు నిండటంతో.. పాపకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని, కోఆర్డినేటర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, టీచర్లు పద్మరాజకుమారి, ఉషా, సెక్రటరీ ముస్తఫా, హెచ్‌ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది గురువే..

కారేపల్లి: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది గురువులేనని మండల విద్యాశాఖ అధికారి జయరాజు అన్నారు. గురువారం మండలంలోని భీక్యాతండాలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. ఇక్కడ విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా తర్ఫీదు ఇవ్వడం అభినందనీయమని, వీరంతా నవోదయ, మోడల్‌స్కూల్, ఏకలవ్య, గురుకుల విద్యాలయ ప్రవేశాల్లో ప్రతిభ కనబరుస్తు సీట్లు సాధిస్తున్నారన్నారు.

అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వనజరాణి, ఉపాధ్యాయురాలు శోభారాణి, పూర్ణ, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ విజయ, రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం..

వైరారూరల్: ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆడపిల్లలను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, బతకనిద్దాం.. అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని మండల స్పెషలాఫీసర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. గురువారం వైరా మండలంలోని స్టేజీ పినపాక గ్రామంలో అధికారులు 'మా పాప – మా ఇంటి మణిదీపం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతుల ఇంటికి వెళ్లి వారిని సత్కరించి, పండ్లు పూలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వైద్యులు హర్ష, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిజాన్‌బీ, సరిత, పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, మంజుల, ప్రమీల, అన్నపూర్ణ, గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.



బాలిక తల్లిదండ్రులను సత్కరిస్తున్న స్పెషలాఫీసర్ సత్యనారాయణ

21న మెగా జాబ్ మేళా

మధిర: ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి మధిర రెడ్డి గార్డెన్స్ కల్యాణ మండపంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళాలో 80 కంపెనీలు పాల్గొని సుమారు 5వేలు మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదువుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇష్టారాజ్యంగా విక్రయాలు



ఎంఈఓ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు

సత్తుపల్లిటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, ఇతర మెటీరియల్స్ ఎమ్మార్పీ లేకుండా విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రాజేశ్వరరావుకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గురువారం వినతిపత్రం అందించాయి. రాష్ట్రంలో అనేక బ్రాంచ్‌లు కలిగిన కార్పొరేట్ పాఠశాలలు తమకు ఇతర బ్రాంచ్‌లలో వచ్చిన ర్యాంకులను స్థానిక బ్రాంచ్ పేరిట ముద్రించి అవి తమ గొప్పగా తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, మండపాటి ప్రభాకర్‌రెడ్డి, ఒగ్గు భగవాన్‌రెడ్డి, జి.వంశీ, పి.నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మినుములో అంతర పంటగా జీలుగు సాగు

మధిర: తొర్లపాడు గ్రామంలో మీనవోలు గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సాగు రైతు కుడుముల వెంకటరామిరెడ్డి మాగాణి భూమిలో వరి తర్వాత 2వ పంటగా మినపలో అంతర పంటగా జీలుగును సాగు చేశారు. మాగాణి భూమిలో వరి కోసిన తర్వాత 2వ పంటగా జీలుగు సాగు చేసినా గాని మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. కానీ కోత కోయడంలో, నూర్పిడి చేయడం కష్టంగా ఉంటుందన్నారు. అయితే పచ్చిరొట్ట ఎరువుకు విత్తనాల కోసం రైతులు తమ పొలాల్లో వారికి కావాల్సిన మోతాదులో పండించుకొని విత్తనాలను సేకరించుకున్నట్లయితే రైతుకు మంచి లాభంగా ఉంటుందన్నారు. జీలుగు 120 రోజులుగా ఇది ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నా తట్టుకొని దిగుబడి రాగలిగిన పంట అని తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

ఎర్రుపాలెం/బోనకల్: మండలంలోని సఖినవీడు, మొలుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్ అంటే నినాదాలు చేశారు. అదే విధంగా బోనకల్ మండలంలోని కలకోట, రాయన్నపేట గ్రామాల్లో పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిశోర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, వెంకటరెడ్డి, నాగిరెడ్డి, సాంబశివరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ సుధీర్‌బాబు, ఆత్మాకమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు, చావా లక్ష్మణ్‌రావు, బందెల ముత్తయ్య, భద్రూనాయక్ తదతరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: సఖినవీడులో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య



బోనకల్: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ స్వర్ణవిజయచంద్ర

తల్లాడ/బోనకల్: ప్రతీ రైతుకు 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని సత్తుపల్లి, మధిర వ్యవసాయ శాఖా ఏడీఏలు వి.శ్రీనివాసరెడ్డి, ఎస్.విజయచంద్ర తెలిపారు. గురువారం తల్లాడ, బోనకల్ రైతు వేదికలో నిర్వహించిన ఫార్మర్ రిజిస్టర్ కార్యక్రమంలో వారు పాల్గొని.. వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహణ కల్పించారు. వారు మాట్లాడుతూ.. రైతులు అందరూ మొబైల్‌యాప్ ద్వారా కానీ వెబ్ పోర్టల్ ద్వారా కానీ వ్యవసాయ విస్తరణాధికారులు వారి క్లస్టర్ పరిధిలో అన్ని గ్రామాల్లో క్యాంప్‌లు చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూయాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు వివరించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధిపొందుటకు ప్రామాణికంగా ఈ ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు తప్పని సరి చేస్తూ కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పవన్‌కుమార్, వినయ్‌కుమార్, ఎస్ మానస, సాయిదీక్షిత్, వేణుయాదవ్, తల్లాడ ఏఓ ఎండి.తాజుద్దీన్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం గ్రామంలో గురువారం కనకదుర్గమ్మ జాతర వేడుక ఘనంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారు గ్రామంలోని మర్రి చెట్టు మొదట్లో వెలిశారని ఆనాటి నుంచి భక్తులు ప్రతి ఏటా అమ్మవారికి జాతర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి గ్రామంలో ప్రభలను ఊరేగించారు. గురువారం తెల్లవారుజాము నుంచే గ్రామంలోని ఆడబిడ్డలంతా దేవాలయానికి తరలి వచ్చి బోనాలు వండి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. కోళ్లను, మేకలను అమ్మవారికి బలి ఇచ్చారు. బస్వాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బయట ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న బస్వాపురం గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజలకు తరలి వచ్చారు.



బస్వాపురంలో కనకదుర్గమ్మ వెలసిన మర్రి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సాయినాధుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సాయినాధుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీసాయికి కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బనిగండ్లపాడు, పెద్దగోపవరం, ఎర్రుపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా నిలయంలో బనిగండ్లపాడు యన్నం పిచ్చిరెడ్డి – కృష్ణకుమారి, బాణాల శ్రీనివాసరావు – లక్ష్మి దంపతులు, మీనవోలు గ్రామానికి చెందిన శీలం అనీల్‌కుమార్‌రెడ్డి – నిహారిక దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బయలెల్లిపోతున్న వలస కూలీలు



సామాన్లతో స్వస్థలాలకు వెళ్తున్న వలస కూలీలు

మధిర: జిల్లాలో మిర్చి కోసేందుకు సుమారు మూడు నెలల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీలు గురువారం స్వరాష్ట్రానికి బయలెల్లిపోతున్నారు. జిల్లాలో మిర్చికోత కూలీల కొరత ఉంది. ఈ క్రమంలో మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజూర తాలూకా నుంచి వందల సంఖ్యలో మిర్చి కోసేందుకు కూలీలు వలస వచ్చారు. మధిర, బోనకల్, ఎర్రుపాలెం తదితర మండలాల్లోని రైతులకు చెందిన పొలాల్లోనే గుడారాలు ఏర్పాటు చేసుకుని నివసించారు. మిర్చి కోత పనులు పూర్తి కావడంతో తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు గురువారం మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.

సంక్షిప్త సమాచారం

కిష్టారం ఓసీలో ఈద్ మిలాప్



మాట్లాడుతున్న పీఓ నర్సింహారావు

సత్తుపల్లిరూరల్: కిష్టారం ఓపెన్‌కాస్టులో గురువారం పీఓ నర్సింహారావు ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. వ్యాఖ్యాత బసీర్.. ఈద్ సందేశాన్ని అందించారు. అనంతరం సేమియా తేనేటి విందు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, మేనేజర్ రామకృష్ణ, కిషోర్, బాలాజీ, వీరప్రసాద్, బాబు, గోపికిషోర్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు



పశువుల టీకాల కార్యక్రమంలో వైద్యాధికారులు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో పశువులకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి అన్వేష్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధికి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణ, వెంకటనారాయణ, చిన్నయ్య, గోపాలమిత్రలు ప్రవీణ్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సింహా

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో రాజీవ్ యువ వికాసం పథకానికి 1,789 మంది వరకు దరఖాస్తు చేశారు. వీటిని వార్డుల వారీగా విభజించి వార్డు ఆఫీసర్లతో విచారణ చేపట్టారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మైసా శ్రీనివాసరావు, ఆర్ఐ లోకేష్, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.